పశువైద్యం అందని దైన్యం

- సిబ్బంది కొరతతో మూతబడ్డ ఉపకేంద్రాలు
- ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్న పశు పోషకులు
- ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న పాడిరైతులు
- పట్టించుకోని అధికారులు



వెంకటాపూర్‌లో మూతపడ్డ పశువైద్య ఉపకేంద్రం

మొయినాబాద్: మండలంలో మూగజీవాలకు పశు వైద్యం అందని ద్రాక్షలా తయారైంది. పశువైద్యశాలల్లో సిబ్బంది కొరతతోపాటు సరిపడా వసతులు లేక పశువులకు సరైన వైద్యం అందడంలేదు. కొంత కాలంగా ఖాళీ పోస్టుల భర్తీకి నోచుకోకపోవడంతో పలు ఉపకేంద్రాలు మూతబడ్డాయి. దీంతో గ్రామాల్లో పశువులకు సరైన వైద్యం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించి పశువైద్యశాలల్లో ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని పాడి రైతులు, గొల్లకురుమలు కోరుతున్నారు.

మండలంలో సిబ్బంది ఇలా..

మండలంలో మూడు పశువైద్య కేంద్రాలు, ఐదు పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. మొయినాబాద్, అమ్డాపూర్, కనకమామిడి గ్రామాల్లో పశువైద్య కేంద్రాలు ఉండగా వీటిలో డాక్టర్లు ఉన్నారు. కనకమామిడి పశువైద్య కేంద్రంలో పశువైద్య సిబ్బంది, అటెండర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉన్న డాక్టర్ కూడా సమయానికి అందుబాటులో ఉండరనే ఆరోపణలు వస్తున్నాయి. అమ్డాపూర్ పశువైద్య కేంద్రంలో అటెండర్ పోస్టు ఖాళీగా ఉంది. మరోవైపు మండలంలోని అజీజ్‌నగర్, చిలుకూరు, పెద్దమంగళారం, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో చిలుకూరు, కేతిరెడ్డిపల్లి, వెంకటాపూర్ పశువైద్య ఉపకేంద్రాల్లో పశువైద్య సిబ్బంది అసలే లేరు.

ఐదేళ్లగా మూతపడ్డ ఉపకేంద్రాలు..

మండలంలోని వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి గ్రామాల్లోని పశువైద్య ఉపకేంద్రాలు గత ఐదేళ్లుగా మూతపడ్డాయి. ఐదేళ్ల నుంచి ఇక్కడ పశువైద్య సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరు. అదేవిధంగా చిలుకూరు పశువైద్య ఉపకేంద్రం మూడేళ్లుగా మూతపడింది. పశువైద్య సిబ్బంది లేకపోవడంతో మూడు గ్రామాల్లో పశువైద్య ఉపకేంద్రాలు తెరుచుకోవడంలేదు. దీంతో ఆయా ఉపకేంద్రాల పరిధిలోని రైతులు, గొర్రెలు, మేకల పెంపకందారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పశువులు, జీవాలు అనారోగ్యానికి గురైతే మొయినాబాద్ మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రానికే వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రైవేటుపై ఆధారపడుతున్న రైతులు

మండలంలో ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు అధికంగా ఉన్నాయి. వాటితో పాటు మండలంలోని చాలా ఫాంహౌస్‌లలో కుక్కలు, కోళ్లు, మేకలు, గుర్రాలు పెంచుతున్నారు. గ్రామాల్లోని పశువులతో పాటు ఫాంహౌస్‌లలోని పశువులకు పశువైద్యం అందించడానికి సరైన సిబ్బంది లేకపోవడంతో చాలా మంది ప్రైవేటు పశువైద్యులపై ఆధారపడుతున్నారు. ప్రైవేటు పశువైద్యులు, సిబ్బందిని తమ పశువుల వద్దకే రప్పించుకుని వైద్యం చేయిస్తున్నారు. దీంతో రైతులపై ఆర్థిక భారం అధికంగా పడుతోంది.

పశువైద్యులు అందుబాటులో లేరు

ఏడేళ్ల క్రితం పది గేదెలతో డైరీ ఏర్పాటు చేశాను. గేదెలకు ఎలాంటి వైద్యం అందించాలన్నా ప్రైవేట్ పశువైద్యులనే సంప్రదించాల్సి వస్తోంది. వెంకటాపూర్‌లో పశువైద్య ఉపకేంద్రం ఉన్నా సిబ్బంది ఎవరూ లేక మూతపడింది. ప్రైవేట్ పశువైద్యులతో వైద్యం చేయిస్తే ఒక్కోసారి రూ.5వేల నుంచి 6వేల వరకు ఖర్చు అవుతోంది. ప్రభుత్వం స్పందించి పశువైద్యులను అందుబాటులో ఉంచితే మాకు ఆర్థిక భారం తగ్గుతుంది.

– భిక్షపతి, పాడిరైతు, శ్రీరాంనగర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

మండలంలో మూడు పశువైద్య కేంద్రాలు, ఐదు పశువైద్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వెంకటాపూర్, కేతిరెడ్డిపల్లి, చిలుకూరు ఉపకేంద్రాల్లో సిబ్బంది లేకపోవడంతో మూతపడ్డాయి. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సిబ్బంది వస్తే ఉపకేంద్రాలు తెరిచే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే అన్ని గ్రామాల్లో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నాం.

– అహ్మద్, మండల పశువైద్యాధికారి

వైభవంగా కార్తీక దీపోత్సవం

భారీగా తరలివచ్చిన భక్తులు


కార్తీక దీపోత్సవంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

షాద్‌నగర్‌రూరల్: కార్తీకమాసాన్ని పురస్కరించుకొని గత మూడురోజులుగా కార్తీక దీపోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. పట్టణంలోని హాజీపల్లి రోడ్డులో ఛత్రపతి శివాజీ కల్చరల్, సోషల్ ఆర్గనైజేషన్ నిర్వాహకులు యాదిగిరి, శ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్తీక దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో కార్తీక దీపోత్సవంలో పాల్గొని తమ భక్తి పారవశ్యాన్ని చాటుకున్నారు. పట్టణంతో పాటుగా వివిధ గ్రామాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున హాజరై హిందూ ఐక్యతను చాటారు. ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రతి హిందువు సనాతన ధర్మాన్ని పాటించడంతో పాటుగా హిందూ ధర్మ రక్షణకు కృషిచేయాలని కోరారు. హిందువులందరూ ఐకమత్యంతో ఏకతాటిపైకి వచ్చి హిందూధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమాన్ని చేపట్టిన నిర్వాహకులను అభినందించారు.

క్లుప్తంగా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి


శానిటేషన్ పనులను నిర్వహిస్తున్న సిబ్బంది

శంకర్‌పల్లి: ప్రతి ఒక్కరూ ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, కమిషనర్ శ్రీనివాస్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. అనంతరం చైర్‌పర్సన్, కమిషనర్ మాట్లాడుతూ.. మున్సిపాలిటీని ఆదర్శంగా నిలపడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు స్పష్టం చేశారు. సిబ్బంది ఎవరూ తమ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించొద్దని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఇళ్లు కూల్చడం సరికాదు

షాద్‌నగర్‌రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వం హైడ్రా పేరుతో పేదల ఇళ్లను కూల్చడం సరికాదని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు మఠం రుషికేశ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం తీసుకొచ్చిన హైడ్రాను స్వాగతిస్తున్నామని, కానీ హైడ్రాను అడ్డుగా పెట్టుకొని పేద ప్రజల ఇళ్లను కూల్చివేయడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని వివరించారు. అక్రమ కట్టడాలను అరికట్టేందుకు కొత్తగా హైడ్రా పోలీస్ స్టేషన్‌లను ఏర్పాటు చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ చెబుతున్నారని, కొత్త మండలాలు, కొత్త మున్సిపాలిటీలు ఏర్పడ్డాక సరైన పోలీస్ వ్యవస్థ లేదని వివరించారు. బఫర్ జోన్‌లలో కట్టిన వాటికి నాటి కాంగ్రెస్ పాలకులు, అప్పటి అధికారులే అనుమతులను ఇచ్చారని తెలిపారు. అనుమతులు ఇచ్చిన వారిని వదిలిపెట్టి పేదలు కట్టుకున్న ఇళ్లను రాత్రికి రాత్రి ధ్వంసం చేయడం ఏమిటని ప్రశ్నించారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్‌ను పక్కన పెట్టి కాంగ్రెస్‌కు అధికారాన్ని కట్టబెట్టింది ఇళ్లు కూల్చడానికేనా అని ప్రశ్నించారు. ఆనాడు తప్పుడు అనుమతులు ఇచ్చిన అధికారులను, అందుకు సహకరించిన నాయకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి


మల్లేశ్‌యాదవ్‌ను సన్మానిస్తున్న శ్రీనివాస్‌చారి

మొయినాబాద్: యువత ఆధ్యాత్మిక చింతనను అలవర్చుకోవాలని విశ్వకర్మ సంఘం మండల ప్రచార కార్యదర్శి కమ్మరి శ్రీనివాస్‌చారి అన్నారు. మండల పరిధిలోని సురంగల్ కట్టమైసమ్మ దేవాలయంలో ఆదివారం గ్రామానికి చెందిన మేకల మల్లేశ్‌యాదవ్ అన్న ప్రసాద కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌చారి అన్నదానం చేసిన మల్లేశ్‌యాదవ్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత భక్తిభావాన్ని పెంచుకోవాలని సూచించారు. భక్తిభావం పెరిగినప్పుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో యువ నాయకులు సీతారాంరెడ్డి, గౌతమ్‌రెడ్డి, యాదగిరియాదవ్, పాండుయాదవ్, జగన్, భావన్, సాయి, పాల్గొన్నారు.

పోలీస్ కిష్టయ్యకు నివాళి


పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

శంకర్‌పల్లి: తెలంగాణ రాష్ట్ర సాధనలో అమరుడైన పోలీస్ కిష్టయ్య 15వ వర్ధంతిని శంకర్‌పల్లిలో ఆదివారం ముదిరాజ్ సంఘం నాయకులు నిర్వహించారు. పట్టణంలోని ముదిరాజ్ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ ముఖ్య అతిథిగా హాజరై పోలీస్ కిష్టయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. ముదిరాజ్ బిడ్డలందరూ ఐక్యంగా ఉండాలని, ఎవరికీ సమస్యలు వచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు మైసయ్య, నాయకులు లింగం, శ్రీనివాస్, పాల్గొన్నారు.

రజక సంఘం కమిటీ ఎన్నిక

చేవెళ్ల: మండలంలోని చేవెళ్ల గ్రామ రజక సంఘం కమిటీని ఆదివారం మండల అధ్యక్షుడు శివకుమార్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా బి.శ్రీనివాస్, రాంచంద్రయ్య, ప్రధాన కార్యదర్శిగా నాగముల్ల కుమార్ ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన సభ్యులు రజకుల అభివృద్ధికి కృషి చేయాలని శివకుమార్ పిలుపునిచ్చారు.

‘సింహగర్జన’కు తరలిన నాయకులు


కేశంపేట: తొమ్మిదిరేకుల నుంచి సభకు వెళ్తున్న నాయకులు


చేవెళ్లలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు


షాబాద్ నుంచి సభకు వెళ్తున్న మాల సంక్షేమ సంఘం నాయకులు

షాబాద్: మాలల సింహగర్జన సభకు భారీగా తరలి వచ్చి తమ సత్తా చాటాలని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించే మాలల సింహగర్జనకు మండలం నుంచి భారీ తరలివెళ్లినట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాలలు ఐక్యతగా ఉంటేనే హక్కులు సాధించుకోగలమన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది మాలలు ఉన్నారని, జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. మాలల సింహగర్జన సభకు భారీగా తరలి వచ్చి సత్తా చాటాలన్నారు. కార్యక్రమంలో మాల సంఘం నాయకులు పెంటయ్య, రాంచందర్, కృష్ణ, వెంకటేశ్, బాల్‌రాజ్, నర్సింలు, మహేందర్, మల్లేశ్, ప్రవీణ్, శేఖర్, తదితరులు ఉన్నారు.

చేవెళ్ల నుంచి..

చేవెళ్ల: సికింద్రాబాద్‌లో జరుగుతున్న మాలల సింహగర్జనకు చేవెళ్ల నుంచి ఆదివారం భారీ ఎత్తున మాలలు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా చేవెళ్లలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కేశంపేట: మాలల సింహగర్జన సభకు మండలంలో మాలలు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి మాలలు స్వచ్ఛందంగా వాహనాల్లో షాద్‌నగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలివెళ్లారు. ఆయా గ్రామాల నుంచి నాయకులు నర్సింలు, భీమయ్య, బుచ్చయ్య, నారాయణ, యాదయ్య, నర్సింహ, మల్లయ్య, ఆంజనేయులు, మల్లేశ్, లింగం, రవి, రామస్వామి తదితరులు తరలివెళ్లారు.

కరాటే సామగ్రి అందజేత

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన కుంగ్‌ఫూ విద్యార్థులకు ఆదివారం షాద్‌నగర్‌కు చెందిన నాయకుడు వినయ్‌కుమార్‌గౌడ్ సాధన కోసం ఉపయోగపడే పలు సామగ్రిని అందజేశారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఆత్మరక్షణకు శిక్షణ తీసుకోవాలని కోరారు. చిన్న వయస్సు నుంచే కుంగ్‌ఫూలో శిక్షణ పొందితే విద్యార్థులు చక్కటి ఆరోగ్యంతో పాటు క్రమశిక్షణ అలవడుతుందన్నారు. నాయకులు, కార్పొరేట్ సంస్థలు క్రీడాకారులకు తమవంతు సహకారం, ప్రోత్సాహం అందించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ శివకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం

శంకర్‌పల్లి: 317 జీఓ బాధిత ఉపాధ్యాయులకు సీఎం రేవంత్ రెడ్డి న్యాయం చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు లచ్చిరాం, ప్రధాన కార్యదర్శి రఘునందన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక చొరవ చూపించి 317 జీఓ ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలన్నారు. స్పౌజ్, మెడికల్ గ్రౌండ్, మ్యూచువల్ బదిలీలపై సబ్‌కమిటీ ఇచ్చిన జీఓల కారణంగా ఉపాధ్యాయులకు ఉపయోగం లేదన్నారు. జిల్లాలో పని చేస్తున్న స్థానిక, స్థానికేతర ఉపాధ్యాయుల జాబితాను తయారుచేసి న్యాయం చేయాలన్నారు.

బాలమల్లేశ్ మృతి తీరని లోటు


షాద్‌నగర్‌రూరల్: బాలమల్లేశ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారెడ్డి

షాద్‌నగర్‌రూరల్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన క్యాదర్శి బాలమల్లేశ్ హఠాన్మరణం సీపీఐ పార్టీకి తీరని లోటని జీపీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహారెడ్డి అన్నారు. ఆదివారం కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బద్దుల జంగయ్య ఆధ్వర్యంలో పట్టణంలోని ముఖ్య కూడలిలో బాలమల్లేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ.. ఎర్రజెండా పోరాటాలకు ఆకర్షితులై విద్యార్థి ఉద్యమంలో పనిచేసిన బాలమల్లేశ్ రాష్ట్రస్థాయిలో ఉద్యమాలను నడిపారని గుర్తుచేశారు. పార్టీ బలోపేతానికి, ప్రజాపోరాటాలను బాలమల్లేశ్ అందించిన సేవలు మరువలేనివని కొనియాడారు. అతిచిన్న వయసులో బాలమల్లేశ్ గుండెపోటుతో మృతి చెందడం బాధాకరమన్నారు. బాలమల్లేశ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేసినప్పుడే ఆయన ఆత్మకు శాంతి కలుగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గడ్డం జంగయ్య, వెంకటేశ్, నర్సింహ, కృష్ణ, రమేశ్‌యాదవ్, రాజునాయక్, చంద్రబాబు పాల్గొన్నారు.

సేవలు మరువలేనివి

మొయినాబాద్: సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కామ్రేడ్ బాలమల్లేశ్ మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.రామస్వామి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బాలమల్లేశ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, మాజీ కార్యదర్శులు రవీందర్, మోహన్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణ, అంజయ్య, మంజుల, సుధీర్, మల్లేశ్, యాదయ్య ఉన్నారు.

రైతు పండుగలు చేసుకోవడం సిగ్గుచేటు

మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్రంలో ఆరు గ్యారంటీల పేరుతో గెలిచి సంవత్సరం పూర్తయినా హామీలను అమలు చేయకుండా రైతు పండుగ చేసుకోవడం సిగ్గుచేటని బీజేపీ రాష్ట్ర నాయకుడు, చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్ విమర్శించారు. ఆదివారం మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్ చౌరస్తాలో గల పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తవుతున్నా ఆరు గ్యారంటీలను గాలికి వదిలి సంవత్సర కాలంలో 60 మోసపూరిత అబద్ధాలు చెబుతున్నారని దుయ్యబట్టారు. 18 సంవత్సరాలు నిండిన ఆడబిడ్డకు భృతి ఏదని, రైతు భరోసా లేదని ప్రశ్నించారు. కల్యాణలక్ష్మితో పాటు తులం బంగారం కాంగ్రెస్ ప్రభుత్వానికి తూతూ మంత్రంగా మారిందన్నారు. రాష్ట్రంలో గతంలో నడుస్తున్న ఆర్టీసీ బస్సులను తగ్గించి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం అంటూ డ్రామా చేస్తున్నారని విమర్శించారు. ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతుంటే పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం అంటూ పేర్కొనడం సిగ్గుచేటుగా ఉందన్నారు. నిరుద్యోగ భృతి నాలుగు వేలు ఏమైందని, విద్యార్థినులకు స్కూటీలు ఎక్కడ ఇచ్చారని విమర్శించారు. రైతు సంక్షేమం పేరుతో రైతు పండుగ జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. పేరుకే కాంగ్రెస్ ప్రభుత్వం పండుగ చేసుకుంటుందని, ప్రజలకు చేసింది ఏమి లేదని బీజేపీ పోరుబాట కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగదని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రైతు కిసాన్ జిల్లా నాయకులు మోర నర్సింహ్మారెడ్డి, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మాధవరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బంటు జ్ఞానేశ్వర్, రాజమల్లేశ్, ప్రభాకర్‌రెడ్డి, అత్తపురం శ్రీనివాస్‌గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వెండి విగ్రహాల ఏర్పాటుకు విరాళం


ఆలయ కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న దాతలు

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో సీతారామాంజనేయస్వామి దేవాలయాన్ని నూతనంగా నిర్మించారు. ఆదివారం నూతన దేవాలయంలోని సీతారాములు, లక్ష్మణుడి విగ్రహాలను వెండితో తయారు చేయించేందుకు దాతలు ముందుకొచ్చారు. దాతలు దుంపల నాగమణి, కుమారులు జగన్, రమేశ్ విగ్రహాల తయారుకు కావాల్సిన రూ.1లక్ష 50వేల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకొని ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. సామాజిక స్పృహతో సమాజాభివృద్ధికి పాటుపడాలన్నారు. నూతన దేవాలయంలో స్వామివార్ల వెండి విగ్రహాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం దాతలను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, అన్మారి వెంకటయ్య గుప్తా, ప్రకాశ్‌చారి, భక్తులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ప్రజాపాలన విజయోత్సవాలు


మొయినాబాద్‌రూరల్: బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ


కేశంపేట: వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

- ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు
- గెలుపొందిన విజేతలకు బహుమతులు
- ఆయా కార్యక్రమాలకు హాజరైన ఎంపీడీఓలు, ఎంఈఓలు

మొయినాబాద్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు విజయోత్సవ కార్యక్రమాలను చేపట్టిందని మండల అభివృద్ధి అధికారి సంధ్య, మండల విద్యాధికారి వెంకటయ్యలు పేర్కొన్నారు. ఆదివారం మొయినాబాద్ మండల పరిధిలోని హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా పాఠశాల హెచ్‌ఎం ఆంజనేయులు ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. మండలంలోని అన్ని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పునరుత్పాదక వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు ఏర్పాటు చేశారు. అనంతరం గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా విజయోత్సవాలను నిర్వహిస్తుందన్నారు. అందులో భాగంగా డిసెంబర్ 1 నుంచి 9వ తేదీవరకు వివిధ కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. మొదటిరోజు డిసెంబర్ 1న విద్యాశాఖ ఉత్సవాలు ఏర్పాటు చేయడంతో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించిన బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో మండల ఆర్‌ఐ అచ్యుత్‌రెడ్డి, ఎన్కెపల్లి పాఠశాల హెచ్‌ఎం జి.లక్ష్మారెడ్డి, కేతిరెడ్డిపల్లి హెచ్‌ఎం శ్రీనివాస్, బాకారం హెచ్‌ఎం నర్సింహారెడ్డి, సీఆర్పీ అన్నపూర్ణ, ఉపాధ్యాయులు శైలజ, భాగ్యలక్ష్మి, రాంచందర్, భార్గవి, సూరజ్‌కుమార్, అక్షిత తదితరులు పాల్గొన్నారు.


చేవెళ్ల: విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందిస్తున్న అధికారులు

చేవెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

చేవెళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం చేవెళ్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాధికారి పురందాస్, ఎంపీడీఓ హిమబిందు ముఖ్య అతిథులుగా హాజరై పునరుత్పాదక వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాజంలో అందరూ సమానులే అని, అందరికీ సమాన అవకాశాలు వస్తాయని స్పష్టం చేశారు. విద్యార్థులందరూ ఐకమత్యంగా ఉండి, స్నేహభావంతో మెలగాలని సూచించారు. పోటీలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతో పాటు, ప్రశంసపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అంతారం హెచ్‌ఎం రామారావు, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో..

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. మండల విద్యాధికారి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పునరుత్పాదక వనరులు అనే అంశంపై వ్యాసరచన పోటీలను తెలుగు, ఇంగ్లిష్ మీడియం విభాగాల్లో నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు ఎంఈఓ బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు కృష్ణయ్య, శ్రీశైలం, శ్రావణ్‌కుమార్, అప్పారావు, జగదీశ్వర్‌రెడ్డి, జగదీశ్‌చంద్ర, హారతి, గౌరి, లావణ్య, సీఆర్పీలు మల్లేశ్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


షాబాద్: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ

భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకోవాలి

షాబాద్: విద్యార్థులు అన్ని పోటీల్లో పాల్గొంటూ భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఎంపీడీఓ అపర్ణ, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. అనంతరం ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా ముందుకు సాగాలన్నారు. విద్యార్థులు ప్రణాళికతో చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.